ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 02 | అక్టోబర్ 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు|| 150/-
విడి ప్రతి : రు|| 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఐ-భీమవరం ... 01-09-2012

జిన్నూరు ......... 28-08-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-2012, ఐ-భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణస్వామి అరుణాచలం వచ్చేసిన రోజు. భగవాన్ పేరు వెంకటరమణ. అందరూ వెంకటరామన్ అని పిలిచేవారు. రమణమహర్షి అని నామకరణం చేసినవారు గణపతిముని. డబ్బుని సంపాదించటంకంటే సద్వినియోగం చేయటం కష్టం. డబ్బుఉందని మీరు దుబారా చేయకూడదు, సద్వినియోగం చెయ్యాలి. భారతదేశంలో తిండి లేకుండా బాధపడేవాళ్ళు, ఇల్లు లేకుండా బాధపడేవాళ్ళు అనేక మంది ఉన్నారు. పిల్లలకి తెలివితేటలు ఉండి చదువు చెప్పించుకోవటానికి అవకాశం లేనివాళ్ళు అనేకమంది ఉన్నారు. వారికి ఏమీ సహాయసహకారములు అందించకుండా మనం డబ్బుని భోగాలకు వృధా చేస్తూ ఉంటే భగవంతుడు మనలను క్షమించడు. కొంతమంది ధనం ఉందని అలవాట్లు పెంచుకుంటారు. చనిపోయిన తరువాత ఈ ధనం కూడారాదు. అలవాట్లుకూడా వచ్చేస్తాయి. అందుచేత మనం నిరాడంబరంగా ఉండటం, నిర్వికారంగా ఉండటం నేర్చుకోవాలి. మనం ఎక్కువ ఖరీదైన బట్టలు వేసుకుంటూఉంటే మనలో ఏదో ప్రత్యేకత ఉందనే బుద్ధి మనకు కలుగుతుంది. నెమ్మదిగా మన మెదడుని అది పాయిజన్ చేస్తుంది. అందుచేత మీకు విద్య పెరిగినా, ధనం పెరిగినా అలవాట్లు పెంచుకోకూడదు. మీరు అలవాట్లకి బానిసలు అవ్వకూడదు. సత్పురుషుల సహవాసం చేస్తే మీరు అభివృద్ధిలోనికి వస్తారు. సత్పురుషులు కాని వాళ్లతోటి స్నేహం చేస్తే మీరు పతనం అవుతారు. మీ పిల్లలు ఎటువంటి స్నేహాలు చేస్తున్నారు, ఏం పుస్తకాలు చదువుతున్నారు, వారు ఇంటిలోంచి బయటికి వెళ్ళాక వారి ప్రవర్తన ఎలాగ ఉందో మీరు చూసుకుంటూ ఉండాలి. అవసరమైతే పిల్లలకి బెత్తం వాడవలెను అని బైబిల్‌లో చెప్పాడు. పిల్లలని క్రమశిక్షణలో పెట్టటానికి అవసరమైతే ఒక

దెబ్బ కొట్టాలి. ఎక్కువ గారం పెట్టినా పిల్లలు పాడైపోతారు.

కారుని కండిషన్‌లో ఉంచుకోవాలి, ఎందుచేతనంటే మన గమ్యాన్ని చేరుకోవటం కోసం. అలాగే మన శరీరాన్ని, మనస్సుని కండిషన్‌లో పెట్టుకోవాలి. ఎందుచేతనంటే మన గమ్యం మన హృదయంలో ఉన్న పరమాత్మ, అక్కడకు చేరుకోవటానికి మన మనస్సు, శరీరం కండిషన్‌లో ఉండాలి. మన హృదయంలో ఉన్న చావుపుట్టుకలతోటి సంబంధంలేని సద్వస్తువుతోటి నువ్వు తాదాత్మ్యం పొందటానికి నీ దేహము, మనస్సు సహకరించాలంటే అవి కండిషన్‌లో ఉండాలి. అంతవరకే దేహము, మనస్సు యొక్క ప్రయోజనం. స్వరూపజ్ఞానాన్ని సంపాదించటానికి నీ దేహాన్ని, మనస్సుని ఎంతవరకూ ఉపయోగించుకొంటున్నావో ఆ టైము ఒక్కటే ముఖ్యం. స్వరూపజ్ఞానం తప్పించి మిగతావి కూడా నువ్వు సాధించవచ్చు. సాధించినా అవన్నీ స్వప్న సమానం, ఒకటి లేని సున్నలు. మనం తినే ఆహారం వలనే శరీరం తయారవుతుంది, మనస్సు తయారవుతుంది. మన ఆరోగ్యం నిలబడాలంటే రుచికోసం ఏదీ తినకూడదు, ఆరోగ్యం కోసం తినాలి. ఎంతరుచిగా ఉన్నా అది ఆరోగ్యం చెడగొట్టేస్తుంది అంటే అది మానేయాలి. ఆహారవిషయంలో, మాట్లాడే మాటలవిషయంలో, నిద్రవిషయంలో మనం నియమబద్ధంగా ఉండాలి. దేహం అనారోగ్యంగా ఉన్నా, మనస్సులో అశాంతి ఉన్నా హృదయంలో మనస్సు నిలబడదు. మనస్సు అంటే ఏమీ లేదు. మనకు వచ్చే సంకల్పాలు, వికల్పాలు, ఇష్టాలు, అయిష్టాలు, కామక్రోధాలు వీనినే మనస్సు అని పిలుస్తారు. బయట అంటూ ఏమీలేదు, అంతా నీలోపలే ఉంది. నీకు ఉన్న కోరికల వల్ల, వాసనల వల్ల, అలవాట్ల వల్ల బయట ఏదో ఉంది అనుకుంటున్నావు. నువ్వు అలవాట్ల యొక్క వేగం తగ్గించుకుంటే నీకు మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కూడా బాగుపడుతుంది. నీకు భోగప్రవృత్తి తగ్గుతుంది. మనిషి పాడైపోవటానికి భోగప్రవృత్తే కారణం.

ఎవరూ ఎవరికీ ఏమీ కారు. ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. ఇంట్లోవాళ్ళకి మనం డ్యూటీ చేయాలి కాని వారు ఏదో మనల్ని ఉద్ధరిస్తారని అనుకోకూడదు. వారిపట్ల మమకారం పెట్టుకోకూడదు. వాళ్ళు అభివృద్ధిలోకి రావటం, రాకపోవటం అనేది వాళ్ళ దేహప్రారబ్ధాన్ని బట్టి ఉంటుంది. దేహప్రారబ్ధానికీ, నీకు సంబంధం ఏమిటి? పుట్టిన వస్తువు ప్రారబ్ధం అనుభవిస్తుంది. పుట్టని దానికి ప్రారబ్ధం ఏమిటి? నువ్వు పుట్టిన వస్తువు కాదు. నువ్వు పుట్టని వస్తువు. నువ్వు సాధన చేస్తే పుట్టని వస్తువు నీకు అనుభవంలోకి వస్తుంది. అప్పుడు దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేస్తావు. నువ్వు శాంతిగా, సుఖంగా ఉంటావు. మనకి జ్ఞాననేత్రం ప్రసాదించటానికి అనేకమంది మహర్షులు, యోగులు ఈ భూమిమీదకి వచ్చారు. నువ్వు ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ, ప్రపంచంలో ఎవరికీ లేని దుఃఖం నీకు వచ్చినప్పటికీ, ఆ దుఖంః నిన్ను బాధపెట్టకుండా అందులోంచి ఎలా విడుదల పొందాలో ఆ రకమైన టీచింగు ఒక భగవాన్ బోధలో మాత్రమే ఉంది. అది భగవాన్ టీచింగు యొక్క వైభవం.

నేను ఆత్మభావన నిలబెట్టుకోవటానికి కష్టపడి సాధన చేసుకుంటూ ఉంటే మనస్సు దేహభావనలోకి వచ్చేస్తుంది. ఆత్మభావనలో నిలబడటం లేదు అని ఒకరు అడిగారు. శరీరానికి రోగనిరోధకశక్తి ఎక్కువ ఉంటే మందులతోటి సంబంధం లేకుండా వచ్చిన రోగాన్ని బయటికి పంపేయగలదు. మీరు చేస్తున్న సాధన సరిపోదు. మీకు దేహభావనకి సంబంధించిన బలం ఎక్కువ ఉంది. మీరు ఆత్మభావనలో తాత్కాలికంగా అప్పుడప్పుడూ నిలబడినా అది సరిపోదు. వారు కాశీ వెళ్ళి తపస్సు చేశారు, వీరు హిమాలయాలు వెళ్ళి తపస్సు చేశారు అంటారు. వాటి ప్రయోజనం ఏమిటీ నువ్వు ఎక్కడికి వెళ్ళి తపస్సు చేసినా దేహాత్మబుద్ధి నశించాలి. నీ మనస్సులో ఉన్న అలవాట్లని ఎండింపచేయటమే తపస్సు. దేహబుద్ధి నశింపచేయటం చాలాకష్టం. మీరు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చోండి. మీకు మంచి తలంపులో, చెడ్డతలంపులో వస్తూంటాయి. ఈ తలంపు ఎందుకు వస్తోంది? కారణం ఎవరు అని చూడండి. మీ దేహమే కారణం అవుతుంది. ఈ దేహమే నేను అనుకుంటున్నారు కదా! మొత్తం అన్ని తలంపులూ దేహబుద్ధిలోంచే వస్తాయి. లోపల వాసనని బట్టి తలంపు వస్తుంది. వాసన ఎలా వస్తుంది. నువ్వు కర్మ చేస్తే ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని నువ్వు అనుభవిస్తావు. అనుభవిస్తే మళ్ళీ వాసన పడుతుంది. ఆ వాసన అదే పని మిమ్మల్ని చేయమని మళ్ళీ పురికొల్పుతూ ఉంటుంది. ఇది విషవృక్షం. దేహబుద్ధి దాటినవాడు దీనిని అతిక్రమించ గలడు కాని దేహబుద్ధిలో ఉన్నంతసేపు ఈ విషవృక్షంలోంచి బయటకు రాలేడు. మనం చనిపోయే దేహమా? అంటే కాదు. చనిపోని ఆత్మే మనం. కానీ మనం దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాం అంటే మనకి ఆత్మయందు దేహబుద్ధి వస్తోంది. దేహం చనిపోయినప్పుడు మీరు నేను చనిపోతున్నాను అనుకుంటారు. దేహం చనిపోతుంది అనుకుంటే ఫరవాలేదు. మీరు చావులేని సద్వస్తువు, చనిపోయేది మీరు కాదు. మీ శరీరం ఈ భూమిమీద తిరుగాడుతుండగానే ఆ చావులేని సద్వస్తువుని మీరు సాధించాలి. మోక్షసుఖం మీరు అనుభవించాలంటే శరీరం చనిపోయే వరకూ ఆగక్కరలేదు. ఈ భూమిమీద ఉండగానే ఆత్మసుఖం పొందవచ్చు. అది అనుభవంలోనికి వచ్చాక మీకు దేవుడు కనిపిస్తే ఆయనను చూడాలని అనిపించదు. మీకు వైకుంఠానికి వెళ్ళాలి, కైలాసానికి వెళ్ళాలి అనే తలంపే రాదు. అంటే ఇష్టంలేక కాదు, వాటి అవసరం మీకు లేదు.

బుద్ధుడు, రమణమహర్షిగారు వచ్చాక సాధన పేరుమీద ఖర్చులు ఏమీ అక్కరలేదు అని ఖర్చులు తగ్గించేశారు. అది వారు లోకానికి చేసిన ఉపకారం. యజ్ఞాలు, యాగాలు అని, ఆ దేవతలని సంతృప్తి పరచండి అని ఇలా కొంతమంది ఖర్చులు పెంచేశారు. ఆ రకమైన ఖర్చులని తగ్గించి సాధనా భాగాన్ని పెంచి, మీకు బయట చూపు తగ్గించి లోచూపు కలుగచేసినవారు బుద్ధుడు, రమణుడు. ఆత్మజ్ఞానం కోసం ఏదో ఖర్చు పెట్టాలి. ఏదో ఖర్చు పెట్టకపోతే రాదు అనే బుద్ధిని పోగొట్టారు, ఆ పాడుబుద్ధి మీకు లేకుండా చేశారు.

రమణమహర్షిగారు ఒక పదినిమిషాల టైములో ఋషి అయిపోయారు. ఆయన మరణానుభవం ద్వారా మృత్యువును జయించారు. ఆ క్షణంతోటి ఆయనకు మరణభయం పోయింది. ఆ అనుభవం మీకు రావాలంటే మీ తెలివితేటలు సరిపోవు, మీ ప్రయత్నం సరిపోదు, మీ అధ్యయనాలు సరిపోవు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా అది సాధ్యము కాదు. ఉన్నది ఈశ్వరుడే, అసలు మనం లేము. మనం ఉన్నాము అనుకుంటున్నాం. మనం అనుకున్నా ఆయన సంకల్పమే, అనుకోకపోయినా ఆయన సంకల్పమే జరుగుతుంది. మీ శరీరం ఈ భూమిమీదకి ఏపని మీద వచ్చిందో మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఆ పని జరిగిపోతుంది. అర్జునా యుద్ధం చెయ్యటానికి, చెయ్యక పోవటానికి నువ్వు ఎవడవు? అందరూ యుద్ధాలు చేస్తారా? నువ్వు యుద్ధం చెయ్యటానికి వచ్చావు. నీ సంకల్పంతో, నీకోరికతో సంబంధం లేకుండా నీ దేహం ద్వారా ఏది జరగాలో అది జరిగిపోతుంది. నీ శరీరం ఎందుకు వచ్చిందో ఆ శరీరం ద్వారా ఆ పని జరిగిపోయిన తరువాత అది చనిపోతుంది. మన చేతిలో ఉన్న పనిముట్టును మనం ఇష్టం వచ్చినట్లు వాడుకుంటాం కదా. అలాగే మనం ఈశ్వరుడి చేతిలో పనిముట్లం. ఆయన ఒకో శరీరాన్ని దానిప్రారబ్ధాన్ని బట్టి ఒకోరకంగా వాడుకుంటున్నాడు. అసలు ఉన్నది ఆయనే మనం ఏమనుకుంటున్నాం. అంటే ఆయనా ఉన్నాడు, మనమూ ఉన్నాము అనుకుంటున్నాం. కానీ ఆయన ఉన్నాడు మనం లేము అనే అనుభవం మనకి వచ్చేవరకూ మనల్ని మాయ వెంటాడుతుంది. ఏ వస్తువుని అయితే నువ్వు పొందుదాము అనుకుంటాన్నావో దాని అనుగ్రహంలేకుండా, దాని దయలేకుండా దానిని నువ్వు పొందలేవు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి.

మనం ఎక్కడికో కాశీ పారిపోవటంకాదు. మనం మాట్లాడే మాటలో, మనకి వచ్చే ఆలోచనలో అహంభావన ఉండకూడదు. అది చూచుకుంటే చాలు. మీకు దేహబుద్ధి నెమ్మదిగా పోతుంది. మీరు ఎక్కడికి వెళ్ళినా ప్రపంచం ఉంది, ఎక్కడికి వెళ్ళినా పంచభూతాలు ఉన్నాయి, ఎక్కడికి వెళ్ళినా మనుషులు ఉన్నారు, రాగద్వేషాలు ఉన్నాయి. అందుచేత నీకు భగవంతుడు కేటాయించిన పనిని నిరహంకారంగా, నిరభిమానంగా చేసుకుంటూపోతే నీకు నెమ్మదిగా దేహబుద్ధి తగ్గిపోతుంది. నువ్వు పని చేస్తున్నావు. ఆపని దేనికోసం చేస్తున్నావు? గౌరవం కోసం చేస్తున్నావా? పనిపనికోసం చేస్తున్నావా? నువ్వు గుర్తింపుల కోసం ఆ పని చేస్తూఉంటే గుర్తింపులు వస్తాయి. అసలు సున్న. ఈశ్వరుడు నిన్ను అనుగ్రహించడు. ఈశ్వరుడు సర్వసాక్షి. నువ్వు మనుషుల్ని మోసం చెయ్యగలవు కాని, ఈశ్వరుడిని మోసం చెయ్యలేవు. ఎందుచేతనంటే నీలో ఉన్న వాసన తలంపు రూపంలో వచ్చిన తరువాత నీకు తెలుస్తుంది కానీ అది తలంపులోకి రాకముందే నీకు వాసన రూపంలో నీ హృదయంలో ఏముందో ఈశ్వరుడికి తెలుసు. వాడు ఈశ్వరుడు. అందుచేత మనం దైనందిన జీవితంలో జాగ్రత్తగా దేహబుద్ధి తగ్గించుకుంటూ ఉండాలి. నీకు ఆలోచన వస్తోంది.

నీకు ఆ ఆలోచన సమాజంలో గుర్తింపుకోసమా లేకపోతే ఈశ్వరానుగ్రహం కోసమా? తలంపు నీకు ఎందుకు వస్తోంది? అని నిరంతరం మనం వాచింగులో ఉండాలి. పుట్టలో పాము ఉందనుకోండి. ఆ పుట్ట దగ్గర మీరు కూర్చున్నారనుకోండి, పాము పుట్టలోంచి బయటకు వచ్చి చూచి, అక్కడ మనుషులు ఎవరైనా ఉంటే మళ్ళీ లోపలికి వెళ్ళిపోతుంది. అలాగే మీరు హృదయంలో వాచింగులో ఉంటే తలంపు పుడుతుంది, అణిగిపోతూ ఉంటుంది. మరల తలంపు పుట్టి అణిగిపోతూ ఉంటుంది. ఆ తలంపు మీకు యాక్షన్‌లోకి రాదు. అప్పుడు వాసన బలహీనపడి చచ్చిపోతుంది. ఎందుచేతనంటే వాసనకి ఫుడ్‌సప్లై తగ్గిపోతుంది.

ఈ మధ్యన అందరూ కుటుంబనియంత్రణ గురించి మాట్లాడుతున్నారు మమ్మల్ని ఏంచేయమంటారు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. కుటుంబనియంత్రణ గురించి ఆలోచించేవాడవు మరి మరణనియంత్రణ గురించి నువ్వు ఎందుకు ఆలోచించటం లేదు అది కూడా ఆలోచించు అన్నారు భగవాన్. నీకు పిల్లలు పుట్టకుండా ఆపు చేసుకుంటున్నావు చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకుంటున్నావు కదా. ఆ భయంలోంచి, ఆ తలంపులోంచి ఎలా బయటపడాలి అని నువ్వేమీ ఆలోచించటంలేదు. నువ్వు మళ్ళీ పుట్టకూడదు. నువ్వు పుట్టకుండా నిన్ను ఎవడు ఆపు చేస్తాడు. అది కూడా ఏదైనా హాస్పటల్‌లో ఆపరేషన్ చేస్తున్నారా? ఎవరైనా చేసేవాళ్ళు ఉంటే ఆపరేషన్ చేయించుకో అన్నారు. సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటం కాదు. లేకపోతే మీ కుటుంబంతోటి ఉన్న అనుబంధాలు విడిచిపెట్టేసి పారిపోవటంకాదు. నీకు జ్ఞానం రాకుండా వాళ్ళు ఏమీ అడ్డుపడటంలేదు. వాళ్ళు అడ్డు వచ్చేస్తున్నారని నువ్వు అనుకొంటున్నావు. అసలు సంసారం అంటే నీకు ఉన్న తలంపులే సంసారం, మనస్సే సంసారం, దేహబుద్ధే సంసారం అంతేకాని ఇంట్లోఉన్న మనుష్యులు సంసారం కాదు. మనం గుఱ్ఱాన్ని నీళ్ళ దగ్గరకి తోలుకెళ్ళవచ్చు కానీ దానిచేత నీళ్ళు తాగించలేము. అలాగే మీ కుటుంబసభ్యులు అభివృద్ధిలోనికి రావటానికి మీరు అవకాశాలు ఇవ్వవచ్చు కానీ వాడు అభివృద్ధిలోనికి రావచ్చు, రాకపోవచ్చు. అది మీకు సంబంధంలేదు. అవకాశాలు మీరు ఇవ్వండి. అది ఉపయోగించు కుంటే అభివృద్ధిలోకి వస్తారు. ఉపయోగించుకోకపోతే అభివృద్ధిలోనికి రారు. వాళ్ళ మీద మమకారం పెంచుకోవద్దు. నీ మనస్సులో ఉన్న మమకారాన్ని విడిచిపెట్టటమే సన్యాసం. అసలు మమకారం అంటూ లేకపోతే మనిషి ఏ తప్పు చేయనక్కరలేదు అని భగవాన్ చెప్పారు. మనిషికి అది తప్పు అని తెలిసినా తప్పు ఎందుకు చేస్తున్నాడు అని అర్జునుడు అడిగాడు. కోరిక వలన అని పరమాత్మ చెప్పాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే అసలు నీకు కోరిక ఎందుకు వస్తోంది. మమకారాన్ని బట్టి వస్తోంది. నీకు మమకారం లేకపోతే నీ మనస్సును కదలమంటే కదలదు. మనస్సుని నిలబెట్టటానికి యోగాభ్యాసాలు అక్కరలేదు, ప్రాణాయామాలు అక్కరలేదు. ఇవన్నీ కల్పించి తెచ్చుకుంటున్నారు. నీకు రోగం వస్తే మందులు కాని అసలు రోగమే రాకపోతే మందులు ఎందుకు. ప్రపంచంలో పాపం అంటూ ఎక్కడా ఏమీలేదు.

ఒకవేళ నీకు పాపం ఉన్నట్టు కనిపిస్తూఉంటే అది మమకారం అని భగవాన్ చెప్పారు. నువ్వు ఏదైనా తప్పు చేశావనుకో, ఎక్కడో నీకు మమకారం ఉంది. మమకారం లేకుండా నీకు తప్పు చేయవలసిన పనిలేదు. మమకారం లేకుండా నువ్వు అసలు పొరపాటు చెయ్యవు అన్నారు. నువ్వు మమకారం కనుక విడిచిపెట్టేస్తే నీటిలో ఉప్పు ఎలా కరిగిపోతుందో అలా ప్రపంచం అంతా మీరు అయిపోతారు. మమకారం ఉంటే దూడని కట్రాడికి కట్టేసినట్టు ఒకచోటే ఉంటారు. మమకారం పోతే ప్రపంచం అంతా మీదే. ఇది నాది, ఇది నాదికాదు అని ఏమీలేదు. ఒకచోట ఉన్నాము, ఇంకోచోటలేము అనే ఫీలింగు కూడా మీకు రాదు. ఎవడికయితే మమకారం పోయిందో వాడి ప్రేమ ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. వాడికి భేదబుద్ధి నశిస్తుంది.

మీరు నిద్రపోతారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. మెలుకువగా ఉన్నవాడు నిద్రపోతాడు, నిద్రపోయేవాడు మేల్కొంటాడు. మనకి ఆ రెండింటి గొడవ లేదు అన్నారు. నేను నిద్రపోను అని చెప్పలేదు ఆయన. ఆత్మకి నిద్ర, మెలకువ ఉన్నాయా, అది సుప్రీంస్టేట్. అది మనకు అనుభవంలోకి వచ్చేవరకూ ఆ స్టేట్ మనకి అర్ధంకాదు. భగవాన్‌కి అరుణాచలం నుంచి కదిలి ఇంకోచోటికి వెళ్ళాలనే తలంపు కూడా రాలేదు. జ్ఞానికి చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు. ఎక్కడికి వెళ్ళినా వాడికి వాడే కనిపిస్తాడు. మీరు అప్పుడప్పుడూ ఆ కొండ వంక చూస్తూ ఉంటారు కదా అని భగవాన్‌ని అడిగితే, కొండవంక చూస్తే నన్ను నేను చూసుకుంటాను అన్నారు. పురాణాలలో పుణ్యం చేసుకున్న వాళ్ళందరూ వైకుంఠం వెడతారని, కైలాసం వెడతారని చెబుతున్నారు కదా! అందుకే ఇక్కడ పుణ్యం చేస్తున్నారు. అయితే ఆ పురాణాలన్నీ అబద్ధాలా అని భగవాన్‌ని అడిగితే, భగవాన్ ఆ లోకాలు లేవని చెప్పలేదు. ఏమన్నారంటే శరీరం చనిపోయాక ఆ లోకాలకి వెళ్ళేవాడు ఒకడు ఉన్నాడు కదా! ఆలోకాలకి వెళ్ళేవాడు ఎంతనిజమో, ఆలోకాలు కూడా అంతే నిజం అన్నారు. అంటే వెళ్ళేవాడు అబద్ధం, అవీ అబద్ధం అని చెప్పటం. ఒక ట్రూత్‌రియలైజేషన్ తప్పించి ప్రతీదీ డ్రీమే అన్నారు. నీకు తెలుసున్న విషయాలలోంచి, నీకు తెలియని విషయాలలోంచి, ఈ బంధాలు ఈ గొడవలలోంచి నిన్ను విడుదల చేసేది నీ హృదయంలో ఉన్న ట్రూత్ ఒక్కటే. ఈ లోకాలు ఆ లోకాలు ఏవీ నిన్ను విడుదల చేయలేవు. భక్తియోగం, కర్మయోగం, జ్ఞానయోగం ఇవన్నీ చెపుతారు కాని అసలు అర్ధం చేసుకోవటం కంటే మించిన యోగంలేదు. మీరు సబ్జక్టుని ఉన్నది ఉన్నట్టు అర్ధంచేసుకోవటం కంటే మించిన యోగం లేదు. అండర్‌స్టాండింగ్ ఇట్ సెల్ఫ్ ఈజ్ యోగ. మీకు సబ్జక్టు అర్ధమవుతూ ఉంటే ఇప్పుడే, ఇక్కడే మోక్షసుఖాన్ని పొందుతారు.

సముద్రంలో ఎంతనీరు ఉందో మీ హృదయంలో అంత సుఖం, శాంతి ఉన్నాయి. ప్రపంచంలో అందరూ నీకు శత్రువులు అవ్వవచ్చు, కానీ నీకు శత్రువులు ఎంతమంది ఉన్నా నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం పొంగి నీ శిరస్సుని ముంచేస్తూ ఉంటే అప్పుడు శాంతి కోసం నీ శరీరం మీద కాని, ప్రపంచం మీద కాని, దేవతల మీద కాని ఎవ్వరి మీదా

నువ్వు ఆధారపడక్కరలేదు. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు దేవుడు వచ్చి కనిపించినా నీకు చూడాలనిపించదు. ఇష్టంలేకకాదు, ఇంక అవసరం లేక. అటువంటి ఆనంద సముద్రంలో నువ్వు మునగటం మానేసి, ఆ హృదయంలోకి ప్రయాణం చెయ్యటం మానేసి ఎక్కడో ఏదో ఉంది, ఎక్కడో ఏదో చూస్తాను అని తిరుగుతున్నావు. ఇది ఒక మాయ. ఏదైతే లేదో దానిని ఉంది అనుకోవటం మాయ. పాముకి తొందరపాటు ఎక్కువ, కాకికి శుభ్రత తక్కువ. మీరు కాకిలాగ, పాములాగ ఉండకండి అన్నారు.

రమణమహర్షిగారు ఇంటిదగ్గర చెప్పకుండా అరుణాచలం వచ్చారు. ఆయన ఇంటిదగ్గర కోపం మీద అరుణాచలం వచ్చారా, కోపంమీద రాలేదు. ఎవరిమీదైనా ద్వేషం మీద వచ్చారా, ద్వేషంమీద రాలేదు. ఆయన టీచింగుకి అరుణాచలాన్ని సెంటర్‌గా ఈశ్వరుడు ఎన్నుకున్నాడు. ఆయన అరుణాచలం వచ్చి ఈశ్వరుడితో ఏమని చెప్పారంటే నా అంతట నేను రాలేదు, నువ్వురమ్మంటే నేను వచ్చాను. ఈ దేహాన్ని నీకు నివేదిస్తున్నాను అన్నారు. బుద్ధుడు, రమణుడు ఇంటిని నార్మల్‌గా, నేచురల్‌గా విడిచిపెట్టారు. మళ్ళీ వాళ్ళు వెనక్కి తిరిగి చూడలేదు. వాళ్ళు ఒక మెసేజ్ ఇవ్వటానికి లోకంలోకి వచ్చారు. భగవాన్ అరుణాచలం వచ్చిన కొత్తలో ఎక్కువ మౌనంగానే ఉండేవారు. మౌనం కూడా మాట్లాడుతుంది. మౌనభాష ఎవరికైతే అర్థమవ్వటంలేదో వాళ్ళకోసం మాట్లాడుతున్నాను అని భగవాన్ చెప్పారు. నీతో మాట్లాడే పని నాకు ఏమీలేదు అన్నారు రంగన్నతో భగవాన్. నాతో మాట్లాడేపనిలేదు అంటున్నావు కదా! మరి ఇప్పుడు నాతో ఎందుకు మాట్లాడుతున్నావు అని రంగన్ అడిగాడు. అవుటాఫ్‌లవ్, అవుటాఫ్‌గ్రేస్, అవుటాఫ్‌మెర్సీ ఇంకో కారణం లేదు అన్నారు. మీ మనస్సుని అలంకరించేవాళ్ళు ఎవరూలేరు అనుకోండి. ఇంక మీ మనస్సుని మీరే అలంకరించు కుంటారు. ఇప్పుడు ప్రత్యేకంగా మనమేమీ కష్టపడక్కరలేదు. మన మనస్సుని డెకరేట్ చేయటం మానేస్తే సరిపోతుంది. ఇదే నిజమైన సాధన. దేహప్రారబ్ధాన్ని బట్టి పరిస్థితులు ఒకోసారి అనుకూలంగా ఉంటాయి. ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి. ఒకోసారి మన చేతినిండా డబ్బు ఉంటుంది. ఒకోసారి మనచేతిలో డబ్బు ఉండదు. ఒకోసారి మన శత్రువులు కూడా మిత్రులు అవుతారు. మన మిత్రులు కూడా శత్రువులు అవుతూఉంటారు. కాలగర్భంలో ఏముందో మనకు తెలియదు. కానీ నీ హృదయంలో ఉన్న శాంతి మేల్కొన్నప్పుడు నీకు ఈ సమస్యలన్నీ సమస్యలే కాదు. ప్రపంచంలో ఉన్న మూడు కోట్లమంది జనం నీకు శత్రువులు అయినా నీకు ఎఱ్ఱచీమ కుట్టినట్టు ఉండదు. అదీ ఆత్మానందం.

నువ్వు ఇంట్లో ఉన్నా, బయటికి పారిపోయినా, అడవిలో ఉన్నా దేహభావనని అతిక్రమించాలి. పరిసరాలు మారినంతమాత్రంచేత దేహభావన పోతుంది అని ఎక్కడా లేదు. అది నువ్వు కష్టపడి కృషిచేసి పోగొట్టుకోవాలి. అరుణాచలం వెడితే కొండ కనిపిస్తుంది. కాశీ వెడితే గంగానది కనిపిస్తుంది. పరిసరాలు మారతాయి. అంతేకాని దేహబుద్ధిని

నువ్వు సాధనచేసి పోగొట్టుకోవలసిందే. దానికి గురువు అనుగ్రహం ఉండాలి. మీ వల్ల మాకు మోక్షం వచ్చేస్తుంది అని భగవాన్‌ని అడిగితే, ఆయన అనేవారు మీకు ఏమో నావల్ల మోక్షం వస్తుంది అంటున్నారు, మరి నాకెలా వచ్చింది? మోక్షం ఇవ్వటానికి ఇంతమంది ఉన్నారా? ఉన్నవాడు ఒక్కడే. ఎవడైతే నాకు శాంతిని ప్రసాదించాడో వాడే మీకుకూడా శాంతిని ఇస్తాడు అన్నారు. 'నేను' అనేది ఆయనకు వాడకంలో ఉండదు.

మీ ప్రోపర్టీమీద కాని, మీ ఇంట్లో ఉన్న మనుష్యుల మీద కాని, బయట సమాజం మీద కాని, మీకున్న అవకాశాలమీదకాని, దేనిమీద అయినా మీ శాంతి, సుఖం ఆధారపడి ఉన్నాయి అనుకోండి, ఆ శాంతి, సుఖం ఎప్పటికైనా దుఃఖం కింద మారిపోతుంది. అది భగవంతుడి చట్టం. అది జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఇతరుల మీద ఆధారపడింది ఏదీ నిలబడదు. మీ ఇంట్లో వ్యక్తుల పట్ల మీ డ్యూటీ చేయవద్దని నేను చెప్పటం లేదు. కానీ ఎక్కడైనా సరే మీ హేపీనెస్ కోసం వాళ్ళమీద ఆధారపడితే రెట్టింపుకి రెట్టింపు అంతా దుఃఖం కింద మారిపోతుంది. ఉండటం అనేది ఎండ్‌లెస్ హేపీనెస్. దానికి ముగింపు ఉండదు. మనం ఏదైనా భోగాలు అనుభవిస్తున్నాము అనుకోండి, దానికి ముగింపు ఉంటుంది. ముగింపు అయిన తరువాత మళ్ళీ పెయిన్ ప్రారంభమవుతుంది. కానీ ఎండ్‌లెస్‌హేపీనెస్ నువ్వు ఎంజాయ్ చేసేకొలదీ ఫ్రెష్‌గా ఇప్పుడే కొత్తగా ఎంజాయ్‌మెంట్‌లోకి వచ్చింది అనిపిస్తుంది. నీకు లోపల నుంచి వచ్చే హేపీనెస్ ఎలా ఉంటుంది అంటే అది ఏక్షణానికి ఆక్షణమే కొత్తగా అనుభవిస్తున్నామా అనిపిస్తుంది. అది అంత ఫ్రెష్‌గా ఉంటుంది. అది డిపెండెంట్ కాదు. అది ఇండిపెండెంట్ హేపీనెస్. మీకు సబ్జెక్టు ఎందుకు చెబుతున్నానంటే ఒకవేళ మీ దేహప్రారబ్ధం బాగోలేదు అనుకోండి, మీకు ఇంటిదగ్గర పరిస్థితులు బాగా లేదు అనుకోండి, ఎటుచూచినా మీకు శత్రువులే అనుకోండి, అయినా మీకు సబ్జక్టు ఉన్నది ఉన్నట్టు ప్రోపర్ అండర్‌స్టాండింగ్ కనుక మీకు వస్తే ఇప్పుడే ఈ క్షణమే మీరు ఈ హోలు విడిచిపెట్టి బయటకి వెళ్ళకుండా మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. ప్రారబ్ధం ఎవరికి, ప్రారబ్ధం దేహానికి. దేహం ప్రారబ్ధం అనుభవిస్తుంది. ఆ దేహం మీరు కాదు కదా. మరి కంగారు ఎందుకు పుడుతోంది? మీకు ఆ దేహంతోటి ఉన్న తాదాత్మ్యం వలన ఇది అంతా వస్తోంది. మనకు ఉన్న దేహం పట్ల ఆత్మబుద్ధిని, దేహంపట్ల సత్యబుద్ధిని, దేహం ఉంటే ఉంటాం దేహంతోటే పోతాం అనేటువంటి మిథ్యాబుద్ధిని తొలగించటానికే అవతారపురుషులు అయినా, ప్రవక్తలు అయినా, జ్ఞానులు అయినా ఈ లోకం మీద అవతరించింది, వాళ్ళకి సొంతపనులు అంటూ ఏమీ లేవు.

మనిషి సబ్జక్టు అర్థం చేసుకోవటం ఎందుకు కష్టం అంటే దానికి స్వార్థం కారణం. ప్రతీ మనిషి సెల్ఫ్ సెంటర్డ్. స్వార్థం వలన వాడికి సబ్జక్టు ప్రోపర్‌గా అందదు. మీరు సబ్జక్టు అర్థం చేసుకొనేకొలదీ సాధన పేరు మీద మీకు కష్టం తగ్గిపోతుంది. మీకు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థమవుతూ ఉంటే మీకు తెలియకుండా ఆ సాధన చేసేవాడు జారిపోతాడు. ఇంక ఎవరితోటి

సాధన చేస్తారు. సాధకుడు ఉంటే సాధన చేస్తాం. వాడు పత్తాలేకుండా వెళ్ళిపోతాడు అనుకోండి మీరు ఇంక సాధన ఏమి చేస్తారు. తుకారామ్ ఏమన్నాడు అంటే ఒకప్పుడు నాకు దేహగతమైన నేను ఉన్నమాట నిజమే. కాని దానిని పోగొట్టుకోవటానికి నేను ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. పాండురంగడి పట్ల ఆయనకి ఉన్న భక్తిలో అది ఎప్పుడు కరిగిపోయిందో కరిగిపోయింది. అది ఆయనకి తెలియదు. ఇప్పుడు ప్రత్యేకంగా దానిని పోగొట్టుకోవటానికి అది లేదు. అది పోయింది అన్నాడు తుకారామ్. రామకృష్ణుడిని ఒక పండితుడు అడిగాడు మీరు శాస్త్రాలు చదువుకున్నారా అని. శాస్త్రాలు చదువుకోవటానికి నాకు చదువు రాదు అన్నాడు. పోనీ విన్నారా అని అడిగాడు. పండితులు చదివి వినిపిస్తూ ఉంటే వింటున్నాను అని చెప్పాడు. శాస్త్రాలలో శరీరం నేను అనే తలంపుని ఎలా పోగొట్టుకోవాలో చెప్పారు అది ఎప్పుడైనా విన్నారా అని అడిగాడు. అవన్నీ విన్నాను అన్నాడు రామకృష్ణుడు. మీరు ఆ నేనును పోగొట్టుకున్నారా అని పండితుడు అడిగాడు. నేను శ్రవణం చేసాను, శ్రవణం చేసింది మననం చేసి ఆ నేను కోసం వెదుకుతున్నాను. ఎంతకాలం వెదకినా అది నాకు కనపడటం లేదు. ఉంటే దానిని పట్టుకొని పోగొట్టుకుందును అది కనిపించకపోతే నేనేం చేస్తాను అన్నారు. అంటే ఆయనకి దేహగతమైన నేను లేదు. ఆ ఒక్క వాక్యాన్ని బట్టి ఆయన అవతార పురుషుడు అని మనకి తెలుస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-08-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అమృతత్వం అంటే మన శరీరం చనిపోయేటప్పుడు ఈ శరీరం పోతోంది, శరీరం పోయినా కాని మనం ఉంటాము అనే అనుభవం మనకు రావాలి. ఆ ఉండటం అనే అనుభవం మీకు ముందుగా వస్తే మంచిదే లేకపోతే ప్రాణం పోయే రోజున అయినా రావాలి. దానినే అమృతత్వం అంటారు, అదే మన జీవితగమ్యం. మీ దేహప్రారబ్ధం ఎలా ఉన్నప్పటికీ అది మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా అంతా స్వప్నమే. ప్రారబ్ధం అనుభవంలోనికి రావటానికే ఈ శరీరం వచ్చింది లేకపోతే మనకు శరీరంతో పనిలేదు. మరణానుభవం ద్వారా మరణం లేని స్థితిని భగవాన్ మధురైలో ఇంటి దగ్గరే పొందారు, అంటే అమృతత్వం పొందారు. దేహం చనిపోయింది, ఈ దేహాన్ని తీసుకొని వెళ్ళి స్మశానంలో దహనం చేస్తారు, మరి దహనం చేసినప్పుడు మనం కూడా పోవాలికదా, మనం ఉన్నట్లు మనకి తెలుస్తోంది కదా అనే అనుభవం ఆయనకు వచ్చింది. ఆరోజు మొదలు ప్రపంచంలో ఏ వస్తువును చూసినా ఆయనకు భయం పోయింది. అంటే ఆ శరీరం తాను కాదని ఆయనకు అర్థమయ్యింది. శరీరం తానుకాదని తెలిసినప్పుడు ఇంక భయం పోయింది. సింహం, పులి, పాము ఇలా ఏ జంతువులు కనిపించినా అది ప్రక్కకి తప్పకోవలసిందే కాని ఆయన ఎక్కడా ప్రక్కకి తప్పకోలేదు అంటే అసలు మరణం పట్ల భయంపోయింది, ఉన్నది ఈశ్వరుడే, మనం లేము